క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


శ్రీజ


రిషిత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల బొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.శ్రీజ, జి.రిషిత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి అండర్ -14 ఎస్‌జీఎఫ్ బాలికల విభాగం పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పీఈటీ పంతం ప్రభాకర్ తెలిపారు. వీరిద్దరు ఈనెల 20 నుంచి 23 వరకు ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయిపోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పార్వతి శ్రీనివాస్ కాలుకు గాయమవడంతో కాలుతీసివేశారు. అప్పులతో ఇబ్బందిపడుతున్న ఆయనకు మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

తంగళ్లపల్లి: రామన్నపల్లెకు చెందిన సిలివేరి నాంపల్లి ఇటీవల మస్కట్‌లో గుండెపోటుతో మరణించగా.. బాధిత కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి రూ.5వేలు, కాంగ్రెస్ నాయకుడు సత్తు శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు చొప్పున అందజేశారు. తిరుపతియాదవ్, నాగరాజు, రమేశ్, శ్రీనివాస్, వినోద్, అజయ్, బద్రి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యం పర్యటన


ఎమ్మెల్యే సత్యంను సన్మానిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి గ్రామాల్లో మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పర్యటించారు. మొదట సీతారామచంద్రస్వామి, హనుమాన్, రేణుక ఎల్లమ్మ, మహంకాళి ఆలయాల్లో పూజలు చేశారు. కొదురుపాకలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ జోగినిపల్లి వెంకట్రామారావు, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనకయ్య, బండి శ్రీనివాస్, నాగుల వంశీ, బొలుమాల శంకర్, పులి లక్ష్మీపతి, ఉయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాటిరాజం సేవలు చిరస్మరణీయం



గంభీరావుపేట: మాజీ మంత్రి, దివంగత పాటిరాజం సేవలు చిరస్మరణీయమని గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు అన్నారు. పాటిరాజం 30వ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

గంభీరావుపేట: విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతోపాటు ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని కల్పించాలనే ఉద్దేశంతో గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను అధ్యాపకులు మంగళవారం క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. అందులో భాగంగా కళాశాలలోని రాజనీతిశాస్త్రం, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు మండల పరిషత్‌ను సందర్శించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాజశేఖర్ మూడు అంచెల వ్యవస్థపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు ధర్మపురి, విజయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి: చందుర్తి మండలంలో 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతు పనులు చేస్తున్నందునా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ మహేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మర్రిగడ్డ, తిమ్మాపూర్ గ్రామాల్లోని సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్, రామన్నపేట, ఆశిరెడ్డిపల్లె, నర్సింగాపూర్, మూడపల్లి, అనంతపల్లి, మర్రిగడ్డ, జోగాపూర్, ఎన్గల్, చందుర్తి, మల్యాల గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ వివరించారు.

రుద్రంగి: మాల్లారంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో లైన్ మరమ్మతులు ఉన్నందున బుధవారం రుద్రంగితోపాటు కొత్తపేటలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందనిఇన్‌చార్జ్ సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

వాడీవేడిగా మండల సమావేశం

- సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు
- గరంగరంగా కోనరావుపేట సర్వసభ్య సమావేశం


సమస్యలపై ప్రశ్నిస్తున్న నిజామాబాద్ సర్పంచ్ అరుణ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: కోనరావుపేట మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కావడం లేదని మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఐదేళ్లు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సభ్యులు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడమే తప్ప పరిష్కరించే దిశగా మండల సభ జరగడంలేదని సభ్యులు అధికారులను నిలదీశారు. పలు రకాల సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

- చెరువు మరమ్మతుల కోసం నాలుగేళ్లుగా అధికారులకు చెబుతున్నా నిధులు మంజూరు చేయడం లేదని, మేజర్ గ్రామపంచాయతీ అయిన నిజామాబాద్‌కు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ నిలదీశారు.
- సుద్దాలకు ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి సభ దృష్టికి తెచ్చారు.
- పోడుభూములకు పట్టాలిచ్చినా చదును చేసుకుందామంటే అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివంగాలపల్లి సర్పంచ్ సురేశ్‌యాదవ్ సభలో తెలిపారు.
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ఖర్చులు ఇప్పటి వరకు ఇవ్వలేదని గొల్లపల్లి, మర్తనపేట సర్పంచులు గోపు పర్శయ్య, వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.
- వాటర్‌ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోవడం లేదని శివంగాలపల్లి సర్పంచ్ సురేశ్‌యాదవ్ ప్రశ్నించారు.
- మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ కారణంగా వరదలకు పొలాల్లో ఇసుకమేటలు వేశాయని, భవిష్యత్‌లో మళ్లీ నష్టం జరుగకుండా మరమ్మతులు చేపట్టాలని మరిమడ్ల సర్పంచ్ మాట్ల అశోక్ పేర్కొన్నారు.
- సర్పంచుల పదవీకాలాన్ని మరో 6 నెలలు పొడగించాలని సర్పంచుల ఫోరమ్ కన్వీనర్, గొల్లపల్లి సర్పంచ్ గోపు పర్శయ్య అధికారులను కోరారు.

సర్పంచులు ఆందోళన చెందొద్దు

గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు ఆందోళన చెందొద్దని, అన్ని బిల్లులు అందుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో సర్పంచులు వివిధ రకాల పనులు చేస్తూ గ్రామాలను అభివృద్ధిలో ముందంజలో ఉన్నారన్నారు. పదవీకాలం పూర్తవుతున్న తరుణంలో బిల్లులు రాక ఆందోళన చెందుతున్నారని, బిల్లులు వస్తాయన్నారు. అధికారులు గ్రామాలను సందర్శించి అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు. సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ, వైస్‌ఎంపీపీ వంగపెల్లి సుమలత, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

దత్తజయంతి ఏర్పాట్లు పరిశీలన


ఆలయంలో డీఎస్పీ, సీఐ తదితరులు

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లిలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించే గురు దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్‌తో కలిసి పరిశీలించారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నీటిలో వరదవెల్లి గుట్టపై గురు దత్తాత్రేయస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. ఆలయం చుట్టూ నీరు ఉండడంతో తెప్పె సహాయంతో డీఎస్పీ, సీఐ ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఉత్సవాలకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరవుతారని తెలిసింది. ఈమేరకు పోలీస్ అధికారులు భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. నాయకులు ఆడెపు రాజు, నాగుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ట్రాలీ ఆటో ఢీ.. ఒకరికి గాయాలు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్ రోడ్డు పరిసరాల్లో మంగళవారం రాత్రి ట్రాలీ ఆటో ఢీకొని గ్రామానికి చెందిన ఎలగందుల కనకయ్య గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. కనకయ్య ప్రధాన రహదారి దాటే ప్రయత్నంలో నడుచుకుంటూ వెళ్తుండగా వేములవాడ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. గాయపడ్డ కనకయ్యను ఆస్పత్రికి తరలించారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సిరిసిల్లటౌన్: సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని డాక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.విజయరఘునందన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేశం గౌడ్, వివేకానంద్, అధ్యాపకులు కనకయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



కోనరావుపేట: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని సర్పంచ్ కెంద గంగాధర్, ఉపసర్పంచ్ చొక్కాల దేవరాజు పేర్కొన్నారు. కోనరావుపేట మండలం బావుసాయిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గుర్రం కృష్ణారెడ్డి బదిలీపై వెళ్లగా మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ షేక్ యాస్మిన్‌పాషా, ఎస్‌ఎంసీ చైర్మన్ జంగం ప్రసాద్, కముటం ప్రభాకర్, బైరగోని సత్తయ్య, షేక్ నజీర్, హెచ్‌ఎం దుమాల రమానాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు బూర్గు శ్రీనివాస్, సమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల ద్వారా పోర్టిఫైడ్ రైస్

గంభీరావుపేట(సిరిసిల్ల): రేషన్‌షాపుల ద్వారా పోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. గంభీరావుపేట మండల వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన పోస్టులపై ఆయన స్పందించారు. రేషన్ బియ్యానికి పోర్టిఫైడ్ రైస్ కలపాలనే నిర్ణయంతో పోషక విలువలు పెంచే కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడం జరుగుతోందన్నారు. పోషకాహార లోప నివారణకు ఇది దోహదపడుతుందన్నారు. బియ్యం కడిగినప్పుడు ఇవి పైకి తేలుతూ ఉంటాయని, వీటిని ప్లాస్టిక్ బియ్యంగా పరిగణించకూడదని కోరారు.

మా'నీటి' కోసం ఎదురుచూపులు

- యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం
- మండలంలో 17వేల ఎకరాల్లో సాగు అంచనా


ట్రాక్టర్ సాయంతో పొలం దున్నుతున్న రైతు

గంభీరావుపేట: ఎగువమానేరు ఆయకట్టు రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. వానాకాలం వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంది. గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే నార్లు పోసుకున్నారు. వరి నాటేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కులు దున్నడం, పొలాలు చదును చేయడం, నార్లు పోసుకోవడం వంటి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. అయితే ఇప్పటి వరకు ఎగువమానేరు నీటిని విడుదల చేయకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో 17 వేల ఎకరాల్లో..

గంభీరావుపేట మండలంలో 17వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. యాసంగి సాగు పనులు ఊపందుకోవడంతో విత్తన దుకాణాల వద్ద రైతుల సందడి కనిపిస్తోంది. విత్తనాలను కొనుగోలు చేసేందుకు రైతులు బారులు తీరుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే విత్తనాలపై అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.

ఎగువమా'నీటి' కోసం ఎదురుచూపులు

యాసంగి సాగు సమయం ఆసన్నమైంది. మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. వరినారు మడులను సిద్ధం చేసుకోవడానికి ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. బోరు, వ్యవసాయబావులు ఉన్న రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఎలాంటి ఆధారం లేని మా'నీటి'పైనే ఆధారపడ్డ రైతులు దిక్కులు చూస్తున్నారు. త్వరగా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈనెల 25వ తేదీ వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆరోగ్య మహిళకు స్పందన


సుందరయ్యనగర్ యూహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ'శిబిరానికి మంచి స్పందన వస్తుందన్నారు. మంగళవారం సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ(600), బ్రెస్ట్(600), ఓరల్ కావిటీ(600) పరీక్షలు చేసినట్లు తెలిపారు. యూటీఐ(9), ల్యాబ్(71), థైరాయిడ్(44), విటమిన్ డీ(44), సీబీపీ(62), సూక్ష్మ పోషకాలు(50) మందికి పరీక్షలు చేసి వీరిలో 9 మందిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

పుస్తెమెట్టెల వితరణ



పుస్తెమెట్టెలు, బియ్యం అందజేస్తున్న ఎంపీటీసీ రాము

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన రేగుల మమత-నర్సయ్య దంపతుల కూతురు కావ్య వివాహం సందర్భంగా ఎంపీటీసీ బైరినేని రాము పుస్తెమెట్టెలు, 50 కిలోల బియ్యం వితరణ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం రవీందర్‌రెడ్డి, శ్రీరాముల వెంకటేశ్, మంద నారాయణగౌడ్, రేగుల భాను, రాజురెడ్డి పాల్గొన్నారు.

యువమిత్ర యూత్ క్లబ్ ఆర్థికసాయం

బోయినపల్లి: బోయినపల్లికి చెందిన గర్రెపల్లి శ్రీనివాస్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులకు మంగళవారం స్థానిక యువమిత్ర యూత్ క్లబ్ సభ్యులు రూ.3వేలు ఆర్థిక సాయం అందించారు.

సైబర్‌నేరాలపై అవగాహన ఉండాలి


నాగారంలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగారంలో మంగళవారం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి కార్డుల నంబర్లు, ఓటీపీలు చెప్పమని అడిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ రాజమౌళి, మహబూబ్‌అలీ, నవీన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సుపాస్‌లు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 23 మంది దివ్యాంగులకు తన డబ్బులతో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ మంగళవారం బస్సుపాస్‌లను అందించారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుచ్చిలింగు సంతోష్‌గౌడ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్


అభినందనలు తెలుపుతున్న నారాయణపూర్ మున్నూరుకాపు ప్రతినిధులు

వేములవాడఅర్బన్: జర్నలిస్టుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, వెన్నంటి ఉండి.. సమస్యలు పరిష్కరిస్తానని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్(ఐజేయూ) ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించిన సందర్భంగా మాట్లాడారు. తన రాజకీయ ప్రస్థానం నుంచి ఇప్పటి వరకు జర్నలిస్టులతో విడదీయని అనుబంధం ఉందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోశ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్టులు రేగుల దేవేందర్, గడ్డం సత్యనారాయణరెడ్డి, దాసరి దేవేందర్, రాపెల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యెల్ల పోశెట్టి బయోపిక్ సీడీ ఆవిష్కరణ

వేములవాడఅర్బన్/చందుర్తి: కళాతపస్వి యెల్ల పోశెట్టి బయోపిక్ సీడీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. చందుర్తి మండలం బండపల్లి మాజీ ఉపసర్పంచ్ కొండ బాలకృష్ణగౌడ్ గుండెపోటుతో మృతిచెందగా.. అతని కుటుంబ సభ్యులను ఆది శ్రీనివాస్ పరామర్శించారు. పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ముస్కు పద్మ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ముస్కు మల్లారెడ్డి, ఎండీ అజీమ్, ఏనుగు లచ్చిరెడ్డి, బాబు ఉన్నారు.

విప్ ఆది శ్రీనివాస్‌కు అభినందనలు

ఎల్లారెడ్డిపేట: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్‌గా నియమితులు కావడంతో మండలంలోని నారాయణపూర్ మున్నూరుకాపు సంఘం సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మున్నూరుకాపు సంఘ అధ్యక్షులు చెట్టిపెల్లి కిష్టయ్య, నల్ల పర్శరాములు, యువజన సంఘం అధ్యక్షుడు అంబూరి బాబు, ఉపసర్పంచ్ సిరిపురం మహేందర్, సభ్యులు వంగల కిషన్, ఎండపెల్లి వెంకట్రాములు, సూర రవి, చల్ల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సిరిసిల్లలో వికసిత్ సంకల్ప్‌యాత్రలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు


పోతుగల్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి గీతాంజలి

- మండలాల్లో వికసిత్ సంకల్ప్ యాత్ర

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు అధికారులు కోరారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'వికసిత్ సంకల్ప్ యాత్ర'ను మంగళవారం సిరిసిల్లలోని పదోవార్డులో నిర్వహించారు. భారతదేశం అభివృద్ధిలో పౌరుల భాగస్వామ్యాన్ని వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో వికసిత్ భారత్ ఆదర్శం

ముస్తాబాద్: వైద్యరంగంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి గీతాంజలి కోరారు. మండలంలోని పోతుగల్‌లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. క్షయ, క్యాన్సర్, మధుమేహం, బీపీలకు ఉచితంగా మందులు ఇవ్వడంతోపాటు, పౌష్టికాహారం కోసం నగదు అందిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ గౌతంరావు, ఎంపీటీసీ బాలకిషన్, హెచ్‌ఈవో యాదగిరి, సూపర్‌వైజర్ ప్రసాద్, ఎల్‌టీ నాగరాజు, ప్రవీణ్, ఆరోగ్యమిత్ర రంజిత్ పాల్గొన్నారు.

కళాకారుల ప్రదర్శన

తంగళ్లపల్లి: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో మండలంలోని మండెపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కళా ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కళాకారులు గడ్డం శ్రీనివాస్, అంతడ్పుల రూప్సీ, దేవయ్య, శిరీష, స్థానిక సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి, ఏపీవో రాపోలు నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత, జేఈ రాజనర్సు, కార్యదర్శి రఘువీరారెడ్డి, టీఏ సుష్మ, ఏఎన్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శన

బోయినపల్లి: బోయినపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ గుంటి లతశ్రీ, ఎంఏవో ప్రణిత, ఎంపీవో గంగాతిలక్, ఏపీఎం, నాయకులు గుంటి శంకర్, ఉదారి నర్సింహచారి, సారంపల్లి రాజు పాల్గొన్నారు.

వికసిత్ సంకల్ప్ యాత్రపై అధికారుల నిర్లక్ష్యం

వేములవాడఅర్బన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు నిర్వహిస్తున్న వికసిత్ సంకల్ప్‌యాత్రపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోశ్‌బాబు ఆరోపించారు. వేములవాడలో మంగళవారం మాట్లాడుతూ 17 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా.. మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 18 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు

- జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు

సిరిసిల్లటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. సిరిసిల్లలోని మినీస్టేడియంలో మంగళవారం రాష్ట్రస్థాయి 9వ తెలంగాణ క్రాస్ కంట్రీ పోటీలను ప్రారంభించారు. ఈనెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 18 మంది ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అండర్-16లో వాసు, శశాంక్, అఖిల, దీక్షిత, అండర్-18లో శ్యాంకుమార్, వాసు, లక్ష్మీప్రసన్న, నిఖిత, అండర్-20లో రేవణ్య, వైష్ణవి, శరణ్య, మెన్ అండ్ వుమెన్ విభాగంలో వినోద్‌కుమార్, గాదర్ల శిరీష, హేమ, ప్రవళిక, అనిత ఉన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్, కుమార్, బాబు ఉన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రారంభం

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మంగళవారం తొలగిస్తున్నారు. రుద్రంగి పంచాయతీ కార్యదర్శి రాందాస్, సెస్ అధికారులు పాల్గొన్నారు.